

కల్వలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## బీఆర్ఎస్ పార్టీతోనే పేదల అభివృద్ధి

కేసముద్రం, నవంబర్ 7: బీఆర్ఎస్, సీఎం కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే తెలంగాణలోని పేదప్రజలు అభివృద్ధి చెందుతారని పార్టీ గ్రామ అధ్యక్షుడు లింగాల పిచ్చయ్య అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ గెలుపు కోరుతూ మంగళవారం మండలంలోని కల్వల గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం, బొడ్రాయి వద్ద పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, అమ్మఒడి, ఆసరా పింఛన్ల వంటి పథకాలు పేదలకు ఆర్థికంగా ప్రయోజనం కలిగిస్తున్నాయని తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా, సాగు నీరు, మద్దతు ధర అందించడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి వస్తే రూ.400కే గ్యాస్, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు రూ.3వేల జీవన భృతి, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల వరకు బీమా, రూ.15 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పరిమితి, ఎకరానికి రూ.16వేల పెట్టుబడి అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ కూన భద్రాద్రి, పార్టీ నాయకులు మోడెం రవీందర్‌గౌడ్, మూరగుండ్ల యాదగిరి, మాందాటి వెంకట్‌రెడ్డి, ఏదునూరి శ్రీనివాస్, కుదరుపాక ఉపేందర్, మేకపోతుల వెంకట్‌రెడ్డి, బొడ్డు వెంకటేశ్, మూరగుండ్ల గాలయ్య, నరేశ్, అనిల్, యాకన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

డోర్నకల్, నవంబర్ 7: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని అమ్మపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉప్పెనపల్లి సత్యవతి పూరిల్లులో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో పూరిల్లు ఒక వైపు పూర్తిగా కాలిపోయిందని, ఇంట్లోని సామగ్రి, గృహోపకరణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయని, వాటి విలువ సుమారుగా రూ.2లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.



అగ్ని ప్రమాదంతో దగ్ధమైన ఫ్రిజ్, సామాగ్రి

## నాడు నీళ్లు లేక వెలవెల.. నేడు జలకళ

నర్సింహులపేట, నవంబర్ 7: నెర్రలు బారిన బీడు భూముల్లో పంటలు పండక ఇబ్బందులు పడిన రైతన్నకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచింది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. చెరువుల్లో పూడిక తీయడంతో రైతులు పూడిక మట్టిని చెలుకల్లో పోసుకొని భూసారం పెంచుకున్నారు. దీనికితోడు కాళేశ్వరం జలాలతో ఎస్సారెస్పీ కాల్వ నిండా నీరు రావడంతో చెరువుల్లో జలకళ సంతరించుకున్నది. 9 సంవత్సరాలుగా చెరువుల కింద రెండు పంటలు పండుతున్నాయి. బావులు, బోర్లకింద రైతులు మూడు పంటలు సైతం పండిస్తున్నారు. చెరువుల్లో నీరు ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు.



నాడు నీరు లేని కొమ్ములవంచ కొత్త చెరువు



నేడు నీటితో నిండు కుండను తలపిస్తున్న చెరువు

- నియోజకవర్గం.. మా కుటుంబం
- మానుకోటలో ప్రతిపక్షలకు స్థానం లేదు
- ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు గల్లంతవడం ఖాయం
- బీఆర్ఎస్‌కు ఓటు వేసి అభివృద్ధికి అండగా నిలవాలి
- మహబూబాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలం.. సీఎం కేసీఆర్ పాలనలోనే సాధ్యం



చిన్ననాగారంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి

ఇనుగుర్తి, నవంబర్ 7: స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి అన్నారు. మండలంలోని చిన్ననాగారం గ్రామంలో మంగళవారం ఆమె ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో పొందుపర్చిన పథకాలను తెలియజేస్తూ ఓటు అభ్యర్థించారు. అనంతరం సీతామహాలక్ష్మి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ ఏర్పడిన తర్వాత తొమ్మిదేళ్లలోనే వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రం విశేషమైన పురోగతి సాధించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. 'రాష్ట్రంలో ఒకప్పుడు కరెంట్ ఉంటే వార్త.. నేడు కరెంట్ పోతే వార్త,గా సీఎం కేసీఆర్ చేశారన్నారు. 'హనుమంతుడు లేని ఊరు.. కేసీఆర్ సంక్షేమం ఫలం పొందని ఇల్లు లేదు' అని వివరించారు. రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు ఒక్క బీఆర్ఎస్ ప్రభుత్వానికే ఉన్నదని, వేయాల్సిన నైతిక బాధ్యత ఓటరు దేవుళ్లకు ఉందన్నారు. ఎన్నికలు వస్తేనే ఊర్లలో కనబడే కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల తర్వాత గల్లంతవడం ఖాయమన్నారు. వారి మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని, మోసపోతే గోస పడతారని చెప్పారు. ఓట్లు అడగడానికి ప్రతిపక్షాలు వచ్చి హామీలు ఇస్తే ముందుగా మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వాటిని అమలు చేసిన తర్వాత ఇక్కడ ఓట్లు అడగాలని నిలదీయాలని సూచించారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బైరు వెంకన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి పరామర్శించి ఓదార్చారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, పార్టీ మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి, తొర్రూరు ఏఎంసీ వైస్ చైర్మన్ కసిరబోయిన విజయ్‌యాదవ్, పార్టీ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ గాయపు జయపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ మద్దెల సైదమ్మా కరుణాకర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బైరు కొమురయ్య, వార్డు సభ్యులు బైరు హరిప్రసాద్, బైరు మంజులా భద్రయ్య, భూక్యా భద్రమ్మా లచ్చునాయక్, ఆత్మ డైరెక్టర్ మునిగంటి కుమార్, గ్రామ అధ్యక్షుడు మద్దెల సుధాకర్, ఉపాధ్యక్షుడు చెడుపాక సురేష్, ప్రధాన కార్యదర్శి చెడుపాక యాకూబ్, ఆదర్శ రైతు జీ వెంకన్న, వీ కొండయ్య, మండల యూత్ సమన్వయకర్త వీ సందీప్, గ్రామయూత్ అధ్యక్షుడు ఉడుత అనిల్‌యాదవ్, సోషల్ మీడియా ఇన్‌చార్జి బీ వినయ్ గౌడ్, సీనియర్ నాయకులు బీ బాలాజీనాయక్, బీ ముత్తయ్య, సీ ప్రగతి వెంకన్న, పీ వ్యాకర్ణాచారి, బీ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలిని ఓదార్చుతున్న సీతామహాలక్ష్మి



మహేశ్, రాజేశ్‌గౌడ్ పేర్లను ప్రకటిస్తున్న సీతామహాలక్ష్మి

### గ్రామ యూత్ ఉపాధ్యక్షుడిగా మహేశ్

చిన్ననాగారం బీఆర్ఎస్ గ్రామ యూత్ ఉపాధ్యక్షుడిగా వరిపెల్లి మహేశ్, ప్రధాన కార్యదర్శిగా గుర్రం రాజేశ్‌గౌడ్‌ను మహబూబాబాద్ ఎమ్మెల్యే సతీమణి సీతామహాలక్ష్మి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ యూత్ అధ్యక్షుడు ఉడుత అనిల్ యాదవ్ తెలిపాడు. అనంతరం ఎన్నికైన వారు మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు ముందుకు సాగుతామని, బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ విజయానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

# పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

**జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు**

కురవి, నవంబర్ 7: ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రామారావు అన్నారు. మండలంలోని రాజోలు జడ్పీహెచ్ఎస్ పాఠశాలను మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉత్తమ ఫలితాల సాధనపై సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం పదో తరగతిలో 100 శాతం విద్యార్థులు పాస్ కావాలన్నారు. ప్రతి పాఠశాలకు 10/10 జీపీఏ కనీసం 10 మంది సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఆ దిశగా తమ బోధన రీతిని మార్చుకోవాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు వీ దామోదర్, కేభీకు, వీ సురేశ్, వీ రాజేశ్వరి, బీ లింగమూర్తి, ప్రభాకర్, చలపతి, పీఈటీ డీ సునీల్ పాల్గొన్నారు.

### రేపటి నుంచి జానపద బృందం నృత్య పోటీలు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 7: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 9 నుంచి 23 వరకు జిల్లా స్థాయి జానపద బృందం నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని గవర్నమెంట్, జిల్లా పరిషత్, మోడల్, కేజీబీవీల్లోని 8,9వ తరగతి విద్యార్థులకు ఈ పోటీలు ఉంటాయన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక గ్రూప్ మాత్రమే పాల్గొనాలని, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం 98495 98281 సెల్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



కురవి: విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు



రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

## రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

గార్ల, నవంబర్ 7: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి గార్ల, బయ్యారం సీఐ బాబురావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు లగేజీ బ్యాగులను, సామగ్రిని, ప్లాట్‌ఫామ్‌పై తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో భారీ మొత్తంలో నగదు తరలించొద్దని ప్రయాణికులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బానోత్ వెంకన్న, ఏఎస్సై రవీందర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ విద్యార్థుల ప్రతిభ

హనుమకొండ, నవంబర్ 7: ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కేయూ వీసీ ప్రొఫెసర్ టీ రమేశ్ తెలిపారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 27 నుంచి ఈ నెల 5 వరకు నిర్వహించిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ పోటీల్లో సాంస్కృతిక విభాగంలో ఎన్‌సీసీకి చెందిన 19 మంది విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారన్నారు. వీరిని మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.